ప్రజాశక్తి

శనివారం 6 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం



- 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 23,244 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు
- 35,353 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ ప్రణాళిక సిద్ధమైంది. రాయితీపై రైతులకు వరి విత్తనాలను వ్యవసాయశాఖ అందజేయనుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 1,45,655 ఎకరాల్లో సాగవుతుందని ఇప్పటికే అంచనా వేసింది. అందుకు 23,244 క్వింటాళ్ల వరి విత్తనాలను వ్యవసాయశాఖ కమిషనరేట్ కేటాయించింది. ఖరీఫ్ కాలంలో సెప్టెంబరు వరకూ 35,353 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని గుర్తించింది. వరి విత్తనాలను ఆర్‌బికెల ద్వారా సరఫరా చేయనుంది. రైతులకు సబ్సిడీపై 1573 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఇవ్వనున్నారు. 35,353 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె) ద్వారా 13,196 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో పది రకాల వరి విత్తనాలను అందుబాటులో పెట్టనున్నారు.

ఎరువులు ఇలా..

ఈ ఏడాది ఖరీఫ్‌లో సెప్టెంబర్ వరకు 35,353 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు గుర్తించారు. వీటిలో యూరియా 19,650, డిఎపి 3174, ఎంఒపి 2929, ఎన్‌పికె 6661, ఎస్‌ఎస్‌పి 2839 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

వరి విత్తన రకం, పరిమాణం

వరి విత్తనం	క్వింటాళ్లు
ఆర్‌జిఎల్ 2537	15,164
ఎంటియు 1064	2474
ఎంటియు 1061	887
బిపిటి 5204	2109
బిపిటి 3291	1419
ఎంటియు 7029	420
ఎంటియు 1121	590
ఎంటియు 1124	109
ఎన్ఎల్ఆర్ 34449	20
ఆర్ఎన్ఆర్ 15048	52

సమసమాజ దార్శనికుడు మార్క్స్

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల జయంతి

సమసమాజ దార్శనికుడు, ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ అని పలువురు వక్తలు కొనియాడారు. మార్క్స్ జయంతి కార్యక్రమాలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం పలుచోట్ల జరిగాయి. ఆ మహనీయుని చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.



సిఐటియు జగదాంబ కార్యాలయంలో నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మార్క్స్ జయంతిని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత మార్క్స్ చిత్రపటానికి సంఘం సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ శ్రామికవర్గ విముక్తి కోసం కారల్ మార్క్స్ జీవితాంతం కృషి చేశారని, ప్రపంచంలో దోపిడీ వ్యవస్థ పోవాలని, కార్మిక రాజ్యం రావాలని సిద్ధాంతం రూపొందించారని తెలిపారు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభం నుంచి బయటపడడానికి మార్క్స్ రచించిన దాస్ క్యాపిటల్ గ్రంథాన్ని నేడు అధ్యయనం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.రాజు, పి.మణి, బి.వెంకటరావు, జి.అప్పలరాజు, యు.రాజు, టి.నూకరాజు, చంద్రమౌళి, ఎం.సూరీడు, జి.పోలేశ్వరరావు, వి.భారతి, యల్లాజీ పాల్గొన్నారు.

అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి పాల్గొని మార్క్స్ గొప్పతనాన్ని వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, బిసిహెచ్.మసేన్, ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళ్లర్పిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

అనకాపల్లి : మార్క్స్ జయంతి సభ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో జరిగింది. మార్క్స్ చిత్రపటానికి నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమా మహేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వర రావు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేసిన దార్శనికుడు కారల్ మార్క్స్ అని అన్నారు. కార్మికులను, కర్షకులను మిగతా 2లో..

వేతన సమస్యపై క్లాప్ డ్రైవర్ల ధర్నాలు



విశాఖలో నినాదాలు చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం చెల్లించాలని, లేకుంటే సమ్మెకు వెళ్లక తప్పదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కమిషనర్ మిగతా 2లో..

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల

▶ వార్త 6లో..

కంపెనీల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి

▶ వార్త 5లో..

మహిళా రెజ్లర్లకు నర్సింగ్ విద్యార్థుల మద్దతు

▶ వార్త 2లో..

ఉక్కు ఉద్యమం.. స్ఫూర్తిదాయకం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న లలిత్ మిశ్రా

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 813వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్షల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ మిగతా 2లో..

పాలీసెట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 10న జరుగనున్న పాలీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జాతీయ సమాచార కేంద్రం హాల్‌లో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరంలోని 28 కేంద్రాల్లో 11569 మంది, భీమిలిలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో 950 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రాల్లోకి 10 గంటల నుంచి అనుమతిస్తామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ ఆస్కారం ఇవ్వరాదన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్లను విద్యా శాఖ నుంచి పంపేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రం వద్దా తాగు నీటి సరఫరా ఉండాలని, వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా మిగతా 2లో..



సమీక్ష నిర్వహిస్తున్న డిఆర్ఓ శ్రీనివాసమూర్తి

మొదటి పేజీ తరువాయి..



మద్దిలపాలెంలో మార్క్స్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సమసమాజ దార్శనికుడు మార్క్స్

పెట్టుబడిదారులు, భూస్వాములు ఏ విధంగా దోచుకుంటున్నారో సమాజానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దాస్ క్యాపిటల్ గొప్పతనాన్ని, కమ్యూనిస్టు ప్రణాళిక విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, బి.నూకప్పారావు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో మార్క్స్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకులు జివిఎన్.చలపతి, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి.. 'పోరాడితే పోయేది ఏమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అని కార్మిక వర్గానికి మార్క్స్ ఇచ్చిన పిలుపును గుర్తు చేశారు. మార్క్స్ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రపంచంలోని అనేక దేశాల్లో దోపిడీ లేని సోషలిస్టు ప్రభుత్వాలు వచ్చాయన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కుమారి, వెంకటరావు, చంటి, రమణ, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

వేతన సమస్యపై క్లాప్ డ్రైవర్ల ధర్నాలు

ఆదేశాల మేరకు వివక్షత లేకుండా జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం చెల్లించకుండా జివిఎంసి అధికారులు వివక్షత ప్రదర్శిస్తూ రూ.12,500 మాత్రమే క్లాప్ డ్రైవర్లకు చెల్లించడం సరికాదన్నారు. మధ్యవర్తులు, కాంట్రాక్టర్ల దోపిడీ లేకుండా ఆప్కాస్‌ను తీసుకువస్తూ జిఒ 136ను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే తీసుకువచ్చిందన్నారు. ఆ జిఒ ప్రకారం ఆప్కాస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న ఆప్కాస్ డ్రైవర్లు చేస్తున్న పనినే క్లాప్ డ్రైవర్లు కూడా చేస్తున్నారని చెప్పారు. ఒకే సంస్థలు ఒకే పనిని ఒకే విధంగా చేస్తున్నప్పుడు ఆప్కాస్ డ్రైవర్లకు ఒక విధంగా, క్లాప్ డ్రైవర్లకు మరో విధంగా వేతనాలు చెల్లించడం సరికాదన్నారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని విమర్శించారు. క్లాప్ డ్రైవర్లను కూడా ఆప్కాస్‌లోకి తీసుకువచ్చి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్ల వేతనాల విషయంపై కౌన్సిల్‌లో అజెండాగా పెట్టి ఆమోదించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు, అనిల్ కుమార్, అశోక్, అప్పన్న, రఫీ, సుధాకర్ రాజు, సీరపు రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు చేపట్టిన నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లందరినీ ఆప్కాస్‌లో కలపాలని, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని, హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో వాహనంపై రూ.65 వేలు లబ్ధి పొందుతున్న కాంట్రాక్టర్లు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే అమలు చేయకపోతే ఈ నెల 15 తర్వాత సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జోన్ అధ్యక్షులు ఏజె.శివకుమార్, కార్యదర్శి పి.సతీష్ కుమార్, కోశాధికారి కె.దుర్గారావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం.. స్ఫూర్తిదాయకం

చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఇఎస్ఎన్.రావు, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వైటి.దాస్, యు.రామస్వామి, గణపతి రెడ్డి, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సమయాలలో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా పరిగణించామని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని తెలిపారు. పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులు కేవలం బ్లూ లేదా బ్లాక్ పెన్, హెచ్‌బి పెన్సిల్, ఎరైజర్, హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలన్నారు. ఒఎంఆర్ షీట్‌లో కేవలం హెచ్‌బి పెన్సిల్‌తో మాత్రమే బబ్లింగ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పాలీ సెట్ కోఆర్డినేటర్ కెడివి.నరసింహారావు, భీమిలి కాలేజీ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకుండా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన, రీసర్వే, మ్యుటేషన్లు, భూ సేకరణ, యుఎల్‌సి భూములు తదితర రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ హక్కు పత్రాల బదిలీ, మ్యుటేషన్ కరెక్షన్ వంటి చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ప్రజలు ఇంత దూరం వస్తున్నారంటే మండల స్థాయిలో తహశీల్దార్లు సరిగా పనిచేయడం లేదని అర్థమవుతోందన్నారు. స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మోచా తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస్ మూర్తి, విశాఖపట్నం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, ఎడి సర్వే విజయకుమార్ పాల్గొన్నారు.

రవికుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సీనియర్ జర్నలిస్టు ధవళేశ్వరపు రవికుమార్ 'బహుముఖ ప్రజ్ఞాశాలి' పురస్కారాన్ని ఇటీవల మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్న నేపథ్యంలో అతన్ని శుక్రవారం పలువురు అభినందించారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం గత నెలలో ఈ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో మంగళవారం ఈ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకయ్యనాయుడుతో పాటు సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రవికుమార్‌కు వారు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

పాతికేళ్లుగా మీడియాలో వివిధ హోదాల్లో పనిచేసిన రవికుమార్ ఫొటో జర్నలిస్టుగా, కార్టూనిస్టుగా, వార్తా విశ్లేషకునిగా, రచయితగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. జర్నలిస్టు నాయకునిగానూ కొనసాగుతున్నారు. వివిధ అంశాల్లో రవికుమార్‌కు ఉన్న ప్రతిభాపాటవాలు 'బహుముఖ ప్రజ్ఞాశాలి' పురస్కారానికి ఎంపిక కావడానికి దోహదపడ్డాయని పలువురు చెప్పుకొచ్చారు.

గ్రంథాలయాల్లో పిల్లలకు వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పిల్లలకు వేసవి శిబిరాలు నిర్వహించి సృజనాత్మకతకు పదును పెట్టనున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అందుకు సంబంధించిన బ్యానర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వీటికిగాను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.25 వేలు, గ్రేడ్ 1 గ్రంథాలయానికి రూ.15 వేలు, గ్రేడ్ 2 గ్రంథాలయానికి రూ.12 వేలు, గ్రేడ్ 3 గ్రంథాలయానికి రూ.10 వేలు చొప్పున బడ్జెట్ మంజూరు చేసినట్లు తెలిపారు.

'మీ కోసం.. మీ భరత్' ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కారణంగా అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, ఎటువంటి అభివృద్ధి పనులూ జరగడం లేదని టిడిపి విశాఖ పార్లమెంట్ కన్వీనర్ ఎం.శ్రీ భరత్ అన్నారు. మీకోసం మీ భరత్ కార్యక్రమానికి ఆయన శుక్రవారం శ్రీకారం చుట్టారు. దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డు నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అచ్చియమ్మ పేటలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి పాదయాత్ర నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్న ఈ పాదయాత్ర లక్ష్మీదేవి పేట, జెండా చెట్టు, భూపేష్ నగర్, తారకరామా కాలనీ ప్రాంతాల్లో సాగింది. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి 'సైకో పోవాలి - సైకిల్ రావాలి' స్టిక్కర్లు అంటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు వాసుపల్లి రామ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు పుక్కళ్ల రాజేశ్వరి, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి గనగళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీభరత్

స్మార్ట్ సిటీ పనులు పూర్తిచేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో జివిఎంసి చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులలో భాగంగా పోర్టు గెస్ట్ హౌస్ సమీపాన అభివృద్ధి పరిచిన రోడ్లను, ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. అనంతరం దత్ ఐల్యాండ్ జంక్షన్ నుంచి సిరిపురం పార్కు హోటల్ జంక్షన్ వరకూ రోడ్డు పనులను, పరిసరాలను పరిశీలించి త్వరితగతిన మిగిలిన పనులను పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. 20వ వార్డులోని చినవాల్తేరు స్మార్ట్ సిటీ స్కూల్ సమీప వీధులలో పర్యటిస్తూ రోడ్లపై వ్యర్థాలను గమనించి పారిశుధ్య కార్మికుల పనితీరుపై ఆరా తీశారు.

టౌన్ ప్లానింగ్ స్పందనకు 8 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

జివిఎంసి పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో టౌన్ ప్లానింగ్ విభాగంలో శుక్రవారం చేపట్టిన స్పందన కార్యక్రమానికి 8 ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డిసిపిలు, ఎసిపిలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపిఆర్ఎస్ సిబ్బంది పాల్గొని వినతులు స్వీకరించారు.

మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సైకాలజిస్టుల బృందం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలో అత్యధిక మంది యువకులు ఉంటున్నారని, దేశంలో ప్రతి 34 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ఏడాదికి 12,400 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన వెంటనే పరీక్ష తప్పిన 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం తమను కలచి వేసిందని చెప్పారు. దీనిని అరికట్టాల్సి ఉందన్నారు. విద్యార్థుల కెరీర్‌పై తల్లిదండ్రులు అధికంగా ఆశపెట్టుకొని, వారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తేవటం వల్ల విద్యార్థులు ఆశించిన మేర మార్కులు సాధించని పరిస్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. సమావేశంలో సైకాలజిస్టులు రాజ్యలక్ష్మి, డాక్టర్ వేణుకుమారి, శ్రీదేవి, జి.వి.నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కనకమహాలక్ష్మి ఇఒగా తిరుమలేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఇఒగా కె.తిరుమలేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నవరం ఇఒగా విధులు నిర్వహిస్తున్న ఆయన రెండేళ్ల పాటు కనకమహాలక్ష్మి దేవస్థాన ఇఒగా విధుల్లో ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఉత్తర్వుల కాపీ పంపించారు.

ఎంపి విజయసాయిరెడ్డితో విక్రమ్ భేటీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయి రెడ్డిని విశాఖ గవర్నర్ బంగ్లాలో ఆ పార్టీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల యూత్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని శాలువాతో సత్కరించారు. రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

మహిళా రెజ్లర్లకు నర్సింగ్ విద్యార్థుల మద్దతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తమకు న్యాయం చేయాలంటూ ఢిల్లీ వీధుల్లో పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నర్సింగ్ విద్యార్థులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఎఐడిఎస్‌ఒ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు కె.అభిలాష్ మాట్లాడుతూ దేశ ఖ్యాతిని నిలబెట్టిన రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున రోడ్లపై నిరసన తెలుపుతున్నారన్నారు.

7న మేడే వారోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : మే డే వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్థానిక జంక్షన్‌లో జరుగనున్న మే డే వేడుకలను జయప్రదం చేయాలని ప్రజలకు సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో యూనియన్ భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, నాయకులు ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన పలు కళా ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజా నాట్య మండలి కళాకారులచే గురజాడ నాటిక ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జానపద నాయకులు బొట్టా తవుడు ఆధ్వర్యాన జాన పద గీతాలు, చిప్పాడ పంచాయతీ ఆశిపాలెం గ్రామానికి చెందిన కళాకారులచే తప్పెట గుళ్ళు, టి.నగరపాలెం గ్రామానికి చెందిన కళాకారులచే కోలాటం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి తదితరులు



సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా కిశోర్‌కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్ కుమార్‌ను నియమిస్తూ జైళ్ల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.రాహుల్‌ను రాజమహేంద్రవరం జైలుకు బదిలీచేశారు. కిశోర్‌కుమార్ గతంలో విశాఖ సెంట్రల్ జైల్లో జైలర్‌గా విధులు నిర్వర్తించారు. విజయనగరం జిల్లా జైలు అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం నెల్లూరు జైళ్ల శాఖ ట్రైనింగ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా విశాఖ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

శేషవస్త్ర అభిషేకం

మధురవాడ : రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారంశేష వస్త్ర అభిషేకం జరిపించారు. అనంతరం స్వామి వారికి శేష వస్త్రం పూలమాలలతో విశేషంగా అలకరించింది. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు వేద పండితులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లో ఉన్న ఆనందమార్గ ఆశ్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ప్రభాత రంజన్ సర్కార్ (బాబా)102వ జయంతి సందర్భంగా శుక్రవారం వంద మందికి దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ మార్గ ఆచార్య సౌమ్యానంద అవధూత, సీనియర్ సభ్యులు ఆర్టీసీ రిటైర్డ్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ వైఎఎన్.రాజు, ఆర్ఎ.పాత్రో, వైఎస్ఆర్.రాజు, వైఎన్.రాజు, చలం, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు, ఆహారం అందిస్తున్న ప్రతినిధులు

వైభవంగా రెండో విడత చందన సమర్పణ

ప్రజాశక్తి-సింహాచలం: డోలా పున్నమిని పురస్కరించుకొని శుక్రవారం వేకువ జామున స్వామివారికి రెండో విడత చందన సమర్పణను అర్చకులు సంప్రదాయపదంగా నిర్వహించారు. మొదటి చందన సమర్పణం అనంతరం గుమ్మడి పండు ఆకారంలో దర్శనమిచ్చిన స్వామి వారు రెండో విడత చందన సమర్పణ అనంతరం నిండుగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కొండదిగువన పుష్కరిణి ప్రాంతం చుట్టుపక్కల వంటావార్పులు చేసుకొని భోజనాలు చేశారు. సాయంత్రం పుష్కరిణిలో స్నానమాచరించి సేవ గరిడీలు, విశేష పూజలతో స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ కాలినడకన తడి బట్టలతో మెట్ల మార్గం గుండా సింహగిరికి చేరుకున్నారు. గాలిగోపురం ఎదురుగా స్వామివారిని కీర్తిస్తూ సంకీర్తనలు తెల్లవారులూ ఆలపిస్తూ స్వామివారిని దర్శించుకుంటారు. మరికొందరు తెల్లవారుజాము వరకు స్వామి సన్నిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహించి వేకువజామున స్వామి దర్శించుకుంటారు. డోలా పున్నమి సందర్భంగా సింహాచల పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగానికి అవార్డు


విద్యార్థులను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రముఖ వృత్తినిపుణుల సంస్థ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ (ఐఇఇఇ) వైజాగ్ బే సెక్షన్ ఇటీవల విశాఖలో నిర్వహించిన ఐఇఇఇ స్టూడెంట్ కాంగ్రెస్- 2023లో గీతం విద్యార్థుల సాంకేతిక ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచింది. రొయ్యల చెరువులలో నీటి ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో మత్స్య సంపద వృద్ధి చెందేలా లోరావాన్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తూ గీతం విద్యార్థులు ఎమ్.వర్ధన్, బి.సాయిఅనీష్, ఎస్.అభిజిత్ రూపొందించిన ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచిందని ఐఇఇఇ గీతం విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహమ్మద్ చిష్టీ తెలిపారు. ఇసిఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారని వెల్లడించారు. లోరావాన్ టెక్నాలజీ వినియోగం వల్ల రొయ్యల, చేపల చెరువులు ఉండే గ్రామీణ ప్రాంతంలో ఏవిధమైన వైఫై నెట్‌వర్క్ లేకపోయినా 16 కిలోమీటర్ల పరిధి నుంచి చెరువులలోని నీటి నాణ్యతను పర్యవేక్షించవచని పేర్కొన్నారు. ఈ విద్యార్థులను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఎల్ఎల్.రాజేశ్వరరావు, ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెంత్ లైన్ అభినందించారు.

కేన్సర్ విజేతలకు హెచ్‌సిజిలో సన్మానం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధిని ఎదుర్కొని ఆరోగ్యంగా జీవిస్తున్న విజేతలకు ఆరిలోవ హెల్త్ సిటీలోని హెచ్‌సిజి ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం సన్మానించింది. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ, 40 ఏళ్ల పైబడిన మహిళలకు ఉచితంగా మోమోగ్రామ్ కేన్సర్ పరీక్షను ఆరు నెలల పాటు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సన్మాన ఉత్సవంలో విశాఖ నార్త్ ఎసిపి చుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ, కేన్సర్ నుంచి బయటి పడాలంటే వైద్యంతోపాటు రోగికి ఆత్మస్థైర్యం ముఖ్యమన్నారు. హెచ్‌సిజి ఆసుపత్రిలో రోగులతో వైద్య బృందం స్నేహపూర్వకంగా మమేకమై ఆత్మస్థైర్యాన్ని అందిస్తున్నట్లు ఇక్కడ వైద్యం పొందిన కేన్సర్ నయమైన రోగులు పేర్కొనడం గొప్ప విషయం అన్నారు. అనకాపల్లి డిఎస్‌పి మల్లా మహేష్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ టిఎస్ఎన్.మూర్తి, ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్టులు డాక్టర్స్ సాంకేత్, డాక్టర్ విజయ ఆదిత్య ఈ కార్యక్రమంలో పాల్గొని కేన్సర్ విజేతలకు మెమోంటో, పుష్పగుచ్చాలు ఇచ్చి సన్మానించారు.



కేన్సర్‌ను జయించిన వారితో ఆసుపత్రి ప్రతినిధులు

ప్రజాసమస్యలపై ఎల్లేటి పోరాటం

ప్రజాశక్తి -గాజువాక : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి సిపిఐ నాయకులు కీర్తిశేషులు ఎల్లేటి రామారావు అని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో శుక్రవారం రామారావు వర్థంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎల్లేటి రామారావు కమ్యూనిస్టు పార్టీ నేతగా, గాజువాక మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసి నిర్వాసితుల హక్కులు, ప్రజల సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. గాజువాక ప్రాంతంలో సిపిఐ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీ అభివృద్ధికి రామారావు ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారా పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. జి.ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, ఐఎన్‌టియుసి నాయకులు గొందేశి మహేశ్వర్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, కోన చినఅప్పారావు, కీలని ముసలయ్య, అంజరి దీపక్ దేముళ్ళ, ఎల్లేటి నరసాయమ్మ, కె.వనజాక్ష్మి, పిల్లా సూర్యపద్మ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అదీప్‌రాజు తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి సాయిమాధవ్‌నగర్, వెంకటాద్రినగర్, ఆర్‌టిసి డిపో ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రానున్న కాలంలో పెందుర్తి నియోజకవర్గంలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి మురళి, బండి సత్తిబాబు, దాసరి సత్తిబాబు, వినోద్, శ్రీకాంత్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


ప్రొహిబిషన్ డిక్లేర్ పత్రాలను అందిస్తున్న జోనల్ కమిషనర్

అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-వేపగుంట : విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని జివిఎంసి జోన్-8 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. జోన్-8 పరిధిలోని సచివాలయల్లో రెండేళ్లు పూర్తిచేసుకున్న సిబ్బందికి ప్రొహిబిషన్ డిక్లేర్ పత్రాలను ఆయన శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఒ నారాయణరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎపిడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అచ్చుపూత మహోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ రుషికొండ దరి ఒమ్మివానిపాలెంలో ఒమ్మి గడ్డన్న సేవ గరిడి ఆధ్వర్యాన పాలకొలువు, అచ్చుపూత మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామం ఆచార, పంప్రదాయాలతో సేవ గరిడి నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి తొలిపాలగొలుపు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున మారు పాలగొలుపు నిర్వహిస్తారు. వైశాఖ బహుళ పాడ్యమి సందర్భంగా అచ్చుపూత కార్యక్రమం చేపట్టారు. ఈ అచ్చు పూత కార్యక్రమం పీతల రాంబాబు, ఒమ్మి గడ్డన్న కుటుంబ పెద్దలు నిర్వహిస్తారని ఒమ్మివానిపాలెం గ్రామపెద్దలు, ఒమ్మి గడ్డన్న సేవా గరిడి ప్రతినిధులు తెలిపారు.

ఆధునికీకరించిన తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆధునికీకరించిన సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అధిక సేవలందించేది రెవెన్యూ శాఖ అని, సిబ్బంది కష్టపడి పనిచేసి ప్రజలకు చేరువ కావాలని సూచించారు. విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయానికి స్థలం గుర్తించాలని ఆర్డీవోను కోరారు. జిల్లాలో నాలుగు హాస్టళ్లను ఆధునికీకరించినట్లు చెప్పారు. సుమారు రూ.8 కోట్లతో కెజిహెచ్‌ను కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించినట్లు వెల్లడించారు. అటెండెంట్లు ఉండే గదులను కూడా ఆధునికీకరించినట్లు తెలిపారు. కొత్తగా నిర్మించబోయే ములగాడ, గోపాలపట్నం, మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయాలు ఆర్చి, భవనం ముఖచిత్రం, డిజైన్ చేయాలన్నారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయాన్ని ఆధునికీకరించిన తహశీల్దార్ పి.శ్యాంప్రసాద్‌ను కలెక్టర్ అభినందించారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్ననాడే సిబ్బంది విధులుపై మరింత దృష్టి సారిస్తారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ,


ఆధునికీకరించిన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మండల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు వల్ల సమస్యలతో వచ్చే ప్రజలకు సహకారం అందించినట్లు అవుతుందని, ప్రజలకు మరింత చేరువ కావచ్చని పేర్కొన్నారు. రీ సర్వే, స్పందనపై దృష్టి సారించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వివిధ సేవలు అందించినందుకు ఈ నెల 8వ తేదీన రాష్ట్ర గవర్నర్ ద్వారా జిల్లా కలెక్టర్ అవార్డు అందుకోబోతున్నట్లు వివరించారు. విశాఖపట్నం ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ, పనిచేసే చోట ఆహ్లాదకరంగా ఉన్ననాడే ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు.

అనంతరం భీమిలి, మహారాణిపేట, ములగాడ, గాజువాక, గోపాలపట్నం, పెందుర్తి, పెదగంట్యాడ, ఆనందపురం, పద్మనాభం, విశాఖపట్నం రూరల్, విశాఖపట్నం అర్బన్ తహశీల్దార్ కార్యాలయాల ఆధునికీకరణకు రూ.ఐదేసి లక్షలు చొప్పున తహశీల్దార్లకు కలెక్టర్ అందజేశారు. భీమిలి ఆర్‌డిఒ కార్యాలయానికి రూ.25 లక్షల చెక్కును భాస్కర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం విశాఖపట్నం అర్బన్ తహసీల్దార్ పి.శ్యాంప్రసాద్‌ను సన్మానించారు. భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథ్, ఉప కలెక్టర్లు ఎస్‌డి.అనిత, రామలక్ష్మి, సత్య పద్మ, డి.ప్రమీలగాంధీ, కలెక్టరేట్ ఏవో కె.ఈశ్వరరావు, తహశీల్దార్లు కె.వేణుగోపాల్, ఆనందరావు, వీరభద్రరావు, పాల్ కిరణ్, కె.జయ, ఆనంద్‌కుమార్, రమాదేవి, ఉప తహశీల్దార్లు ఎం.చేతన్‌కుమార్, చైతన్య, రాజేష్, రవికృష్ణ, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఫిల్మ్ డైరెక్టర్లను సన్మానిస్తున్న దాడి సత్యనారాయణ, రమణమూర్తి

ఘనంగా డైరెక్టర్స్ డే

ప్రజాశక్తి-సీతమ్మధార : దర్శకరత్న కీర్తిశేషులు డాక్టర్ దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ విష్ణు స్కూల్స్, విష్ణు ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన డైరెక్టర్ యాదకుమార్ నేతృత్వంలో సింధూర గెస్ట్ హౌస్‌లో డైరెక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన ఎనిమిది మంది ఫిల్మ్ డైరక్టర్లను స్టార్ మేకర్ సత్యానంద, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, రిటైర్డ్ ఎడిసిపి మహమ్మద్ ఖాన్ సత్కరించారు. ఈ సత్కారంలో భాగంగా హాస్య ప్రియ క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన దాదాపు ఏడు షార్ట్ ఫిల్మ్‌ల్లో నటించి దర్శకత్వం వహించిన ఈమంది ఈశ్వరరావును కూడా సత్కరించారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న కీర్తిపట్నాయక్

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -మాధవధార : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార ట్రస్టు ఆధ్వర్యాన మురళీనగర్‌లో మజ్జిగ పంపిణీని ట్రస్ట్ వ్యవస్థాపకులు కుప్పిలి కీర్తిపట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యాన సిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలను ఏర్పాటుచేసి దాహార్తిని తీరుస్తున్నామని చెప్పారు. వేసవికాలంలో ప్రజలు మజ్జిగ, నీరు, కొబ్బరి నీరు, బార్లీ తదితరాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పైడి కృష్ణారావు, వినోద్, కె.ప్రసాదు, మాధురి, పణిభూషణరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

11లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ పింఛను దారులు ఈ నెల 11వ తేదీలోగా ఇకెవైసి చేయించుకోవాలని ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులను తీసుకొచ్చి స్థానిక ఎస్‌టియు నాయకులను సంప్రదించి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. లేకుంటే 12వ తేదీ నుంచి పింఛను డబ్బులు పొందలేరని స్పష్టం చేశారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం శివారు ఏడుగుళ్ల వద్ద కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల సన్నిధి ప్రాంగణములో శుక్రవారం మధ్యాహ్నం 150 మంది నిరుపేదలకు అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా మల్కాపురం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ప్రతి బుదవారమూ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక సహాయం చేసిన వారందరికీ గ్రామ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు బోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు సత్యల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, పట్నాల అప్పారావు (దేముడు), కనకరాజుస్వామి, తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధనలో పాల్గొన్న గ్రామ పెద్దలు

సూర్య కుటుంబానికి రూ.19 లక్షల పరిహారం

ప్రజాశక్తి- ములగాడ : విశాఖ నేవల్ షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బిసి) సంస్థలోని నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేస్తున్న దోగాన సూర్య ఎలియాస్ సూర్యనారాయణ ప్రమాదంలో మృతిచెందడంతో రూ.19 లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు సంస్థ యాజమాన్యం అంగీకరించింది. కంపెనీలో సూర్యనారాయణ 14 సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 3తేదీన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బ్రిడ్జిపై పనిచేస్తూ జారి పడి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా కవిటికి చెందిన సూర్యనారాయణకు భార్య దూగాన యశోద, ఇద్దరు కుమారులు నవిన్ (21), కిరణ్ (19) ఉన్నారు.

కంపెనీలో సూర్యనారాయణ మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే విశాఖ డిఫెన్స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి, నాయకులు ఎం.సుబ్బారావు, కె.శేఖర్, కె.పెంటారావు అక్కడకు చేరుకొని మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని నవయుగ ఇంజినీరింగ్ యాజమాన్యాన్ని డిమాండ్‌చేశారు. స్పందించిన యాజమాన్యం చర్చలకు అంగీకరించింది. సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ఎం.సుబ్బారావు, కె.శేఖర్‌తో చర్చలు జరిగాయి. మృతుని భార్య దూగాన యశోద కుటుంబానికి కంపెనీ నుంచి రూ.19లక్షలు, ఇన్స్యూరెన్స్ రూ.11 లక్షలా 50 వేలు, కుమారుల్లో ఒకరికి ఉద్యోగం, పిఎఫ్, ఇఎస్‌ఐ నుంచి వచ్చే ఆర్థికపరమైన పనులపై బాధ్యత తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించింది. భౌతికకాయాన్ని స్వగ్రామానికి పంపించేందుకు, దహన సంస్కారాలకు అయ్యే ఖర్చును భరించడానికి యాజమాన్యం అంగీకరించింది. నవయుగ ఇంజినీరింగ్ యాజమాన్యం తరుపున పిఆర్‌ఒ మూర్తి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : ఇపిఎస్- 95 పెన్షనర్స్ సమస్య పరిష్కరించాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో శుక్రవారం ఆల్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దీనబంధు, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9000, దానికనుగుణంగా డిఎ ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం, రేషన్‌కార్డులు కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రికి డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ పెదగంట్యాడ అధ్యక్షులు కణితి అప్పలరాజు, ఎన్.అప్పలనాయుడు, గంట్యాడ పైడిరాజు, బైరెడ్డి గురప్ప, పాల వెంకయ్య, నాగిరెడ్డి అప్పలనాయుడు, ఎన్‌వి.రమణ, జి.దుర్గారావు, నమ్మి అప్పారావు, సోమినాయుడు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి ఎస్‌సి కాలనీ, బొర్రమాంబ ఉప్పర కాలనీలో రూ.19.90లక్షలతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పైపు లైన్‌కు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాల్లో 95 శాతం అమలు చేశారని, చెప్పనివి కూడా చేస్తున్న గొప్ప నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థతో గడప వద్దకే పాలన తెచ్చారన్నారు. 85వ వార్డులో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీప్రసాద్ తీసుకెళ్లారు. వాటర్ స్కీం పథకం వల్ల కొండవాలు ప్రాంతంలోని కాలనీలకు తాగునీటి సదుపాయం మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇల్లపు ప్రసాద్, యలమంచిలి అప్పారావు, నక్క రమణబాబు, ఇల్లపు వాసు తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్‌కు శంకుస్థాపన ఎమ్మెల్యే నాగిరెడ్డి

7న కామెడీ స్కిట్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన క్లబ్ ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు కోరుకొండ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి భవనంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి విశాఖ హ్యూమర్ క్లబ్, క్రియేటివ్ కామెడీ క్లబ్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, బాబాయి లాఫింగ్ క్లబ్, అనకాపల్లి లాఫింగ్ క్లబ్, డాక్ యార్డ్ కల్చరల్ క్లబ్‌తోపాటు హైదరాబాద్ కామెడీ క్లబ్ నిర్వాహకులు కూడా పాల్గొని జోక్స్, కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకుల్ని అలరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, గౌరవ అతిథులుగా యాద కుమార్, డాక్టర్ చిట్టిబాబు, పద్మజారెడ్డి పైడి శంకరరావు, ఎమ్మెస్ మాధవ్, ఎస్ఎస్ఎన్ రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మహమ్మద్ ఖాన్, కొణతాల రాజు, పణిస్వామి హాజరవుతున్నట్లు రంగారావు తెలిపారు. జబర్దస్త్ ఫ్రేమ్ అప్పారావు, సత్తిపండు హాస్యాన్ని పండిస్తారని సంఘం గౌరవాధ్యక్షులు ప్రసన్నకుమార్, అధ్యక్షులు జీవిత, గౌరవ సలహాదారు జువాది లక్ష్మి తెలిపారు. ఉపాధ్యక్షులు జబర్దస్త్ సత్తిపండు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్, శ్రీధర్ కోశాధికారి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ, ఈ నవ్వుల ప్రాంగణానికి అందరూ ఆహ్వానితు లేనని, ప్రతి ఒక్కరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బుద్ధుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి ఎన్ఎడి కాలనీలోని పార్కులో ఉన్నావ్ రామ్ కుమార్ ఆర్థిక సహాయంతో బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఎడి కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బిటి.మూర్తి మాట్లాడుతూ, బుద్ధుడి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోషిత భాంతే, ఉన్నావ్ రామ్‌కుమార్, జగన్నాథరాజు, నందగోపాల్, డి.అప్పారావు, కేరి, చక్రి, సుజాతనగర్ కాలనీ ప్రెసిడెంట్ భాష పాల్గొన్నారు.

జోన్-8 ఎఎంహెచ్‌ఒగా కృష్ణంరాజు

ప్రజాశక్తి-వేపగుంట : జోన్-8 ప్రజారోగ్య శాఖ అధికారిగా జె.కృష్ణంరాజు నియమితులయ్యారు. గతంలో పార్వతీపురం పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సహకారంతో జోన్-8ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

కంపెనీల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి

- మహిళా రెజ్లర్ల ఉద్యమానికి మద్దతు
- డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి - అచ్యుతాపురం

రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం కంపెనీల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము డిమాండ్ చేశారు. దేవించియల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాము మాట్లాడుతూ ప్రభుత్వ చట్టాన్ని అచ్చుతాపురం ఎస్ఇజెడ్, రాంబిల్లి ఎన్ఎఒబి, పరవాడ ఫార్మాసిటీ కంపెనీలలో అమలు చేయడం లేదన్నారు. ఆ కంపెనీల కోసం స్థానికులు తమ భూములను, ఇళ్లను త్యాగం చేశారని తెలిపారు. కంపెనీల నుండి వచ్చే కాలుష్యం వల్ల స్థానికులు కేన్సర్, కిడ్నీ, లివర్, టిబి వంటి అనేక రోగాల బారిన పడుతున్నారని, దుమ్ముధూళి, వాహనాల రద్దీ వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులు పడుతున్న స్థానికులకు 75 శాతం ఉద్యోగాల చట్టాన్ని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్ల పట్ల మోడీ ప్రభుత్వం తీరు చాలా దారుణంగా ఉందన్నారు. రెజ్లర్లకు తమ సంఘం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోము నాయుడు, సహాయ కార్యదర్శి సిహెచ్.శివాజీ, జిల్లా నాయకులు ఎన్.నారాయణ, సిహెచ్.నూకన్న, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము



వర్సిటీ అధికారులతో ఐసిఆర్ సెల్ సభ్యులు

మేధో సంపత్తి హక్కులపై పరిశోధనలకు కృషి

ప్రజాశక్తి- సబ్బవరం

దేశంలో మేధో సంపత్తి హక్కులు, వాటికి సంబంధించిన చట్టాలు ఇప్పటికీ అభివృద్ధి దశలోనే ఉన్నాయని, ఈ అంశంలో పరిశోధనల కోసం డిఎస్ఎన్ఎల్‌యు ఐపిఆర్ సెల్ మరింతగా కృషి చేయాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.సూర్యప్రకాష్ తెలిపారు. ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ విభాగం (ఐపిఆర్ కాపీరైట్, డిజైన్ విభాగం) వారు స్కీమ్ ఫర్ పెడగోగి అండ్ రీసెర్చ్ ఇన్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అండ్ అకాడమియా (ఎస్‌పిఆర్ఐహెచ్ఎ) కింద తమ వర్సిటీలో ఐపిఆర్ చైర్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించినట్లు వెల్లడించారు. ఈ మేరకు భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నుండి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ సూర్య ప్రకాష్, సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ పి.శ్రీసుధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జోగి నాయుడును అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల (ఐపిఆర్) అంశంపై పరిశోధనలు పెంపొందించడంలో లా వర్సిటీ ఐపిఆర్ వారు అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.మధుసూదనరావు సెంటర్ ఫర్ ఐపిఆర్ బృందం పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -వడ్డాది : అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట మండలం, వడ్డాది హైస్కూల్ మైదానంలో తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని జెడ్పిటిసి సభ్యుడు దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండోలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలి రోజు శిక్షణకు సుమారు 400 మందికి పైగా బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిరోజు ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు 15 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ప్రతినిధులు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న బాల బాలికలకు ధ్రువీకరణ పత్రం, మెమోంటో అందజేస్తామని చెప్పారు.

మేడే క్రీడా పోటీలు ప్రారంభం


లెమన్ అండ్ స్పూన్ గేమ్ ఆడుతున్న చిన్నారులు

2ప్రజాశక్తి- మునగపాక రూరల్

మేడే క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద శుక్రవారం క్రీడా పోటీలను సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం, సిఐటియు, గవర్ల అనకాపల్లి నెహ్రూ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి 7వ తేదీ వరకు మేడే క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని నాగులాపల్లి, గవర్ల అనకాపల్లి, తోటాడ, వాడ్రాపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 7న సాయంత్రం 5 గంటల నుండి గవర్ల అనకాపల్లి గ్రామంలో దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, నృత్య కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జెయింట్ వీల్, బాహుబలి జారుడు బల్ల, జంపింగ్ వంటి ఆటలను ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం వివిధ క్రీడా సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు ఆళ్ళ సూరిబాబు, రామలక్ష్మి, అంజలి, బేబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులతో సమావేశం అభినందనీయం

ప్రజాశక్తి- అనకాపల్లి : వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పందన' అర్జీదారులతో అనకాపల్లి జిల్లా కలక్టర్ రవి పఠాన్‌శెట్టి ప్రత్యేక శ్రద్ధతో వర్చువల్ సమావేశం నిర్వహించడం అభినందనీయమని పబ్లిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి సమావేశాల వల్ల పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. సోమవారంతో సంబంధం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య అర్జీలను స్వీకరిస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 'స్పందన' మొబైల్ యాప్, spandana.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. అర్జీల స్టేటస్‌ను టోల్ ఫ్రీ నెంబర్లు 1902, 1800-425-4440 ద్వారా లేదా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు దాఖలు సమయంలో ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు.

వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షునిగా రాము



ప్రజాశక్తి- దేవరాపల్లి : వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా తిమిరాం గ్రామానికి చెందిన గర్రెడ్డి రాము నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి వీర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా మెరుగు నూకరాజు, సలహాదారుగా కోరుబిల్లి వెంకటరావు, మాడుగుల నియోజకవర్గం కన్వీనర్‌గా పాత్రుని శ్రీరామ్మూర్తి నియమితులయ్యారని రాము ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి హామీతో గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -కశింకోట : ఉపాధి హామీ పథకంతో గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కశింకోట ఎపిఓ శివ అన్నారు. స్థానిక మండల సమాఖ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డులు లేన వారు ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జెరాక్స్‌లతో విఆర్‌పిలకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎమ్ శ్రీనివాసరావు, ఎల్‌సిసి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఓ శివ

మాతృ మరణాల కట్టడికి పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రసవ సమయంలో మాతృ మరణాలపై తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై ఆయన సమీక్షించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు తగిన శిక్షణ, సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. భౌగోళికంగా ఏ ప్రదేశంలో ఎక్కువగా గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గుర్తించాలన్నారు. రక్తహీనత, గర్భస్థ సమస్యలపై స్త్రీలకు క్షుణ్ణమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమస్యలు ఎదుర్కొంటున్న గర్భిణులకు తగిన వైద్యం అందిస్తూ వారి బంధువులకు కూడా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వైద్య సలహాలను తప్పక పాటించే విధంగా వారికి నచ్చజెప్పేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ఏఎన్ఎం ఆశా కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ ఎ.హేమంత్, సిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి ఉషారాణి, ఆర్ఎంఓ డాక్టర్ రామ్మోహన్, డిఐఓ డాక్టర్ మురళీకృష్ణ, ఏడిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శారదాబాయి, జిల్లాలోని సిహెచ్‌సి, పీహెచ్సీల డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి

పౌర హక్కుల దినోత్సవానికి ప్రాధాన్యత కల్పించడంలో సహకరించాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ మురళీకృష్ణను డివిఎంసి సభ్యులు కోరారు. ముందుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెసి, ఎస్‌పిలను వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ భూ సమస్యలపై సత్వర పరిష్కారం తీసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పౌర హక్కుల సమావేశాలకు స్టేషన్ హౌస్ ఆఫీసురు హజరయ్యేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా ఇరువురు అధికారులు స్పందించి ఇకపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు మార్తి అప్పలరాజు, రేబాక మధుబాబు, గంగాధర మరియమ్మ, యోగిరాజు, మరువాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.


జెసి జాహ్నవికి శుభాకాంక్షలు తెలుపుతున్న డివిఎంసి సభ్యులు

అందరికీ సరిపడా తాగునీరు

ప్రజాశక్తి-చోడవరం : ప్రతి కుటుంబానికీ సరిపడినంత తాగు నీటిని అందివ్వాలని ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ పథకం చేపట్టినట్లు జల్ జీవన్ మిషన్ టాటా ట్రస్ట్ డైరెక్టర్ దివ్యాంగ్ వాఘేలా తెలిపారు. మండలంలో సేమినాపల్లి, ఖండేపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో దివ్యాంగ్ వాఘేలా శుక్రవారం సందర్శించారు. అన్ని గ్రామాల నీరు, పారిశుధ్య కమిటీలతో సమావేశం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సీజన్లోనూ నీటి నాణ్యత పరీక్షలను విధిగా జరుపుకోవాలని సూచించారు. బెన్నవోలులో నిర్మితమవుతున్న ఎన్ఫీల్డ్ రేషన్ ట్యాంకును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేనాపతి రాజశేఖర్, ఎం.శంకరరావు గ్రామాల సర్పంచులు, సెక్రటరీలు, టాటా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జల్ జీవన్ మిషన్ టాటా ట్రస్టు డైరెక్టర్

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల

విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా రెండో విడత నిధులు శుక్రవారం విడుదలయ్యాయి. సిఎం జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు సాగాయి.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో సిఎం కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల 33 లక్షల 55 వేల మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో 383 జంటలకు ఈ నిదులతో లబ్ధి చేకూరనుందన్నారు. రూ.40 వేలను భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఇవ్వనున్నామన్నారు. అర్హులకు నేటికీ లబ్ధి చేకూరకపోతే జూన్, డిసెంబరు నెలల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్పర్సన్ పల్లా చినతల్లి, నగరాల కార్పొరేషన్ చైర్పర్సన్ పిల్లా సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణిమ దేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించేందుకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. కళ్యాణమస్తు, షాదీతోఫా కింద ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి లబ్దిదారులకు శుక్రవారం రెండవ విడత నిధులు విడుదల చేసిన సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని లబ్దిదారులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద రెండవ విడత 667 మంది జంటలకు రూ.3,86,70,000 లబ్ధి చేకూరుతుందన్నారు. మొదటి విడతతో కలిపి ఇప్పటివరకు 799 మంది జంటలకు రూ.4,77,05,000 అందజేసినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ జంటలకు రూ.లక్ష చొప్పున, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బిసిలకు రూ.50 వేలు, బిసి కులాంతర వివాహం చేసుకున్నవారికి రూ.75 వేలు, వికలాంగులకు రూ.1.50 లక్షలు, రిజిస్టరు అయిన భవన కార్మికులకు రూ.40 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ బి.వరాహ సత్యవతి, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, జిఎస్‌డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, డిఎల్‌డిఓ ఉదయశ్రీ, లబ్దిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

సత్వరమే ఇళ్ల నిర్మాణం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇల్లు లేని ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న కాలనీలను అందించడం జరిగిందని, ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని వేట జంగాలపాలెంలోని జగనన్న కాలనీ లబ్దిదారులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టాలు ఇచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా కొందరు లబ్దిదారులు ఇల్లు కట్టకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. ఎంపీడీవో ధర్మారావు మాట్లాడుతూ త్వరగా ఇల్లు పనులు ప్రారంభించక పోతే ఆ స్థలాన్ని వేరే లబ్దిదారునికి ఇచ్చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, గ్రామ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో దుర్గారెడ్డి ప్రతిభ

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : సిఎం కప్ రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో మండలంలోని కాకరపల్లి గ్రామానికి చెందిన కొల్లి పద్మ సాయి దుర్గారెడ్డి బాక్సింగ్‌లో ప్రతిభ చూపించారు. ఈనెల 1 నుండి 5వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం స్టేట్ లెవెల్ టోర్నమెంట్లో బాక్సింగ్ పోటీలో దుర్గారెడ్డి కాంస్య పతకం సాధించారు. విశాఖ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో మూడో సంవత్సరం చదువుతున్న పద్మ సాయి దుర్గారెడ్డి బాక్సింగ్ 92 కేజీల విభాగంలో ఈ ఘనత సాధించాడు. గతంలో కూడా దుర్గారెడ్డి బాక్సింగ్‌లో 8సార్లు అవార్డులు సాధించాడు. దుర్గారెడ్డిని కాకరపల్లి సర్పంచ్ కొల్లి ముసలయ్య నాయుడు, ఎంపిటిసి శిరీష అభినందించారు.

మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలెం గ్రామం యాతపేటలో మినీ వాటర్ ట్యాంక్, బోర్వెల్ నిర్మాణ పనులకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, బొడ్డపాటి రామ్‌కుమార్, బొడ్డపాటి చిన్న రాజారావు, ఆర్టీసీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ చదరం చిన్న, వార్డు మెంబర్లు, మాది బోయిన నాగరాజు, వెలగా నూకరత్నం, మోది నాయుడు, యన్నంశెట్టి రామారావు, పొలమరశెట్టి కృష్ణ, రవ్వ శ్రీను, తట్ర సత్యారావు, కొణతాల అర్జున్ నాయుడు, షరీఫ్ పాల్గొన్నారు.

వికలాంగులు రుణాలను సద్వినియోగపర్చుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డిసి) మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారికి అనుభవమున్న రంగంలో వ్యాపారానికి పెట్టుబడిగా పెట్టి అభివృద్ధి చెందాలన్నారు. రుణం సక్రమంగా తిరిగి చెల్లించవలసి ఉంటుందన్నారు. సహాయ సంచాలకులు జివిబి జగదీష్ మాట్లాడుతూ ఎన్ఎఫ్‌డిసి జిల్లాకు రూ.ఒక కోటి కేటాయించారని, ఇప్పటివరకు లోను మంజూరైన వారు 21 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.59 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు.

7న జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రాంబిల్లి :మండలంలోని హరిపురం వద్ద నిర్మించిన జనసేన పార్టీ యలమంచిలి నియోజకవర్గం కార్యాలయాన్ని ఈ నెల 7న పార్టీ రాష్ట్ర నాయకులు కొణిదెల నాగబాబు ప్రారంభించనున్నారని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నూతన కార్యాలయంలో విజయ్‌కుమార్, ఆయన అన్నయ్య సతీష్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ నాగబాబు వస్తున్న సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు పప్పల నూకన్న దొర, శ్రీరామదాసు, వేణి పాల్గొన్నారు.

లలితా పంచాయతన ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం నిదానం దొడ్డి పార్కు సెంటర్లో శ్రీలలితా పంచాయతన దేవాలయం 12వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ఆహ్వానం మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగ జగదీష్‌ను ఆలయ కమిటీ సభ్యులు చదరం వెంకటరావు తదితరులు శాలువాతో సత్కరించి లలిత దేవి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ద కుమార్, బుద్ద సత్యనారాయణ, ఆడారి త్రినాద్, బొడ్డేడ రాము, కర్రి ఓం శివ, మల్ల జగన్నాధరావు, దాడి నాగేశ్వరరావు, బుద్ద సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధుని జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైశాఖి పౌర్ణమి సందర్భంగా గౌతమ్ బుద్ధుని 2567వ జయంతి వేడుకలు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యాన సబ్ జైల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి సబ్ జైల్ సూపరింటెండెంట్ వైఎన్.గణేష్ రెడ్డి బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి క్యాండిల్స్ వెలిగించి పూజలు చేశారు. ఖైదీలకు బుద్ధుని బోధనలు, సమాజానికి మార్గ దర్శకాలు అన్న అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం, ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, అల్లాడ శ్రీనివాసరావు, బొబ్బి మల్లేశ్వర రావు, పట్నాల కృష్ణ మోహన్, మైలపల్లి నూకరాజు, కాసారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుద్ధుని బోధనలు నేటి సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు అన్నారు. బుద్ద పౌర్ణమి సందర్భంగా మండలంలోని దిబ్బిడి గ్రామంలో గల గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. శాంతి సహనం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, పెదరెడ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు



దిబ్బిడిలో బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మోడల్ స్కూళ్లలో 2023 -2024 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష వచ్చేనెల 11న ఏ మండలంలో మోడల్ స్కూలు ఉంటే అదే మండలంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓసి, బిసి విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22, 2022 -23 విద్యా సంవత్సరంలో నిరవధికంగా చదువుతూ 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు నెట్ బ్యాంకింగ్ క్రెడిట్‌లను ఉపయోగించి పేమెంట్ గేట్వే ద్వారా ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. అనంతరం వారికి కేటాయించిన జనరల్ నెంబర్ ద్వారా ఇంటర్నెట్లో www.cse.ap.gov.in/apms.ap.gov.in ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసి బీసీలకు 150 రూపాయలు, ఎస్సీ ఎస్టీలకు 75 రూపాయలు ప్రవేశ రుసుముగా చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్షల్లో ఓసి బీసీలు 35 మార్కులు, ఎస్సీ ఎస్టీలు 30 కనీస మార్కులు పొందాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కశింకోట

నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. కశింకోట మండలం పేరంటాలపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వికలాంగులకు సదరం సర్టిఫికెట్లు మంజూరులో ఎదురవుతున్న సమస్యలను పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రామాలయం నిర్మాణానికి మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు. రూ.11 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. 40 శాతం సబ్సిడీతో మంజూరైన పవర్ టిల్లర్స్, దమ్ము యంత్రాలను ముగ్గురు రైతులకు మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, సర్పంచ్ అల్లవరపు సన్యాసి రావు, ఉపసర్పంచ్ వజ్రపు నాగ శ్రీను, ఎంపిటిసి తుంపాల మంగ తాయారు, మలసాల కిషోర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఎంపిడిఒ కొంకి అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపలి : రాష్ట్రంలో పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని కలిగొట్ల పంచాయతీ శివారు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలిగొట్ల పంచాయతీ శివారు బందారుపాలెం, దిబ్బగరువు, రాయపురెడ్డి వారి కల్లాలలో మంత్రి పర్యటించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, గ్రామ సర్పంచ్ గొర్లెపోటు సుధారాణి సారథి, ఎంపీటీసీ సభ్యులు రుత్తల వరలక్ష్మి రాంబాబు, వైసిపి నాయకులు బూరె బాబురావు, చింతు రాము తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి-అనకాపల్లి : బాధితులకు సత్వర న్యాయం జరగాలంటే బార్ అండ్ బెంచ్ రిలేషన్ బాగుండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ గంగరాజు పేర్కొన్నారు. దీనికి అందరం ఐక్యంగా అందరమూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించిన వారికి స్వాగత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ ఎవరు ఎక్కడ పని చేసినా ప్రజలకు న్యాయ సేవలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. ఈనెల 13న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవి కిరణ్, స్పెషల్ కోర్టు జడ్జ్ రామచంద్ర మూర్తి, బార్ అధ్యక్షులు సాయి లక్ష్మణరావు ,సెక్రెటరీ సూరా శ్రీనివాస్, సభ్యులు కింతాడ ఈశ్వరరావు, సాయిరాం, శ్రీనివాసరావు, రామచంద్రరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అనకాపల్లి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షులు విత్తనాల పోతురాజు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇపిఎఫ్ 95 ప్రకారం కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, రిటైర్డ్ కార్మికుల భార్య భర్తకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.శంకర్, ఎన్.వి.సత్యనారాయణ, మామిడి విష్ణు, వి.లక్ష్మణరావు, వి.వి.రెడ్డి, పి.సత్యారావు, చంద్ర శేఖర్, పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

ప్రజాశక్తి- అనకాపల్లి : గవరపాలేనికి చెందిన పిళ్లా సూర్య ప్రకాష్‌రావు మృతి చెందగా, వైఎస్ఆర్ బీమా పథకం కింద అంత్యక్రియలు నిమిత్తం రూ.10వేలు నగదును ఆయన భార్య గౌరీకి 80వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అంబేద్కర్ నగర్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కర్రి శివుడు, కర్రి మోది నాయుడు, పొలిమేర ఆదిబాబు, కర్రి కృష్ణ, కొణతాల శ్యామ్, కర్రి ఈశ్వరరావు, విల్లూరి శేఖర్ పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యా రంగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పెద్దపీట వేస్తున్నారని 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షులు పప్పల రమణమూర్తి పేర్కొన్నారు. డీఎస్సీ 1998 బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయులు అనకాపల్లిలో సమావేశమై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కల్పలత, పోరాటాలు చేసిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 300 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల సత్వర పరిష్కారమే ధ్యేయం

-జాయింట్ కలెక్టర్ జాహ్నవి- పలు చోట్ల ఫిర్యాదుదారులతో సమావేశం



మునగపాకలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి:స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి పేర్కొన్నారు. కలెక్టరేట్లో శుక్రవారం జిల్లా మొత్తం పెండింగ్ స్పందన పిటిషన్లపై పిటిషనర్లతో మండల తహశీల్దారు కార్యాలయాల వద్ద ఔవఎజుఇ/జఱసవశీ ఎశీఅటవతీవఅషవ ద్వారా ఫిర్యాదులను సంతృప్తికరంగా పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. డివిజనల్ స్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీలు ఒకే వేదికపై, మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్‌హెచ్‌ఓలు, మండల సర్వేయర్లు ఒక వేదికపై ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించేందుకు ఈ నూతన కార్యక్రమం జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ప్రారంభించారని తెలిపారు. దీని వలన ప్రతి దరఖాస్తుదారుడి సమస్యను మరింత గుణాత్మకంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. శుక్రవారం సుమారుగా 137 మంది స్పందన పిటిషనర్లు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయాల వద్ద, తహశీల్దారు కార్యాలయాల వద్దకు వచ్చారు. ఇకపై ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం అమలు చేసి సమస్యలు పూర్తి పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

దేవరాపల్లి : స్పందనలో వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఎస్ఐ డి.నాగేంద్ర ఈ సమావేశంలో పాల్గొని, స్పందనలో వచ్చిన సమస్యలను గురించి, ఫిర్యాదుదారులకు తక్షణ పరిష్కారం అందించే విధంగా చర్యలు చేపట్టారు.

మునగపాక రూరల్ : పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని అసిస్టెంట్ కలెక్టర్ దాత్రి రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ హాల్లో శుక్రవారం స్పందన ఫిర్యాదుదారులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. స్పందనలో పరిష్కారం కాక పెండింగులో ఉన్న ఫిర్యాదులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఎస్సై మహమ్మద్ అలీ, డిప్యూటీ తహశీల్దార్ వినయ్ కుమార్, సంబంధిత అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:తహసిల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో రేవేక్స్ స్పందన దరఖాస్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా స్పందన కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ పలువురు ఉన్నత అధికారులు తహసిల్దార్ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిటీషనరతో స్వయంగా మాట్లాడి సలహాలు, సూచనలు అందజేశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యామ్ కుమార్, ఎంపీడీవో వి.రామచంద్రమూర్తి, ఈఓఆర్ డి.సత్యనారాయణ, ఎస్ఐ పి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సై నారాయణరావు స్పందన సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోటవురట్ల2 సచివాలయానికి చెందిన దాకారపు సత్యవతి (విడో) వికలాంగుడైన ఆమె కుమారుడు మోహనకృష్ణలకు పించన్ నిలిపివేయడంతో స్పందనలో చేసుకున్న ఫిర్యాదుపై రివ్యూ నిర్వహించారు. ఆమె ఒక వసతి గృహంలో పనిచేస్తూ ఉండటం రూ.12000 వేతనం రావడంతో ఇరువురి పింఛను ఆగిపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానకమ్మ మాట్లాడుతూ, పెండింగ్ సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సతీష్, మండల సర్వేయర్ వరప్రసాద్, పాల్గొన్నారు.



కోటవురట్లలో మాట్లాడుతున్న అదికారులు



సమావేశమైన మత్స్యకారులు

మత్స్యకారులపై ప్రభుత్వం చిన్నచూపు

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అనకాపల్లి జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షులి గోసల చిన తాతారావు, పాయకరావుపేట టిడిపి మండల కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథం తెలిపారు. శుక్రవారం నక్కపల్లి నూకాలమ్మ గుడి ఆవరణలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంతోనే మత్స్యకారులకు న్యాయం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీతోనే మత్స్యకారుల సంక్షేమం, రాజకీయ అభివృద్ధి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో టిడిపి ప్రభుత్వం బలోపేతం చేసేందుకు మత్స్యకారులంతా కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, నక్కపల్లి తెలుగు యువత అధ్యక్షులు పిక్కి రాంబాబు, జిల్లా బి సిసెల్ మీడియా కోఆర్డినేటర్ ఎరిపిల్ల అప్పలరాజు, గరికిన సింహాద్రి, పి.సత్తియ్య, పెంటకోట ఎం.పి.టి.సి కె.లక్ష్మణ్, గంపల అప్పన్న, పీక్కి గంగరాజు, కోదండరావు, దేవుడు తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వెంటనే వాడుకలోకి తీసుకురావాలని డి ఎల్‌పిఓ ఎస్ఎస్ఎస్ మూర్తి సూచించారు. మండలంలోని ఉద్దండ పురం లో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేసి వాడుకులకు తీసుకువచ్చి, గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు. సుందరీకరణ చేపట్టేందుకు గుర్తించిన చెరువును పరిశీలించారు. చెరువును అభివృద్ధి పరచాలన్నారు. వేంపాడు పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో అందిస్తున్న సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ

పుస్తకాల పంపిణీకి సన్నద్ధం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పుస్తకాల పంపిణీకై మండల విద్యాశాఖ అధికారి పి అప్పారావు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 5466మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పుస్తకాలను ఆయా పాఠశాలలకు చేరవేయాలని సూచించారు.



పంపిణీ చేస్తున్న సర్పంచ్

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల:మండలం లోని ఎం.కోడూరు లో శుక్రవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామానికి కొత్తగా 6 గురు లబ్ధిదారులకు పింఛన్లను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు రాజేష్, పడాల అప్పలరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయంలో అన్నదానం నిర్వహించారు. వాసవి క్లబ్ సభ్యుల నిర్వహణలో ముందుగా ఆలయంలో హెూమం, అభిషేకాలు చేశారు. కీర్తిశేషులు సుతాపల్లి నరసింహమూర్తి కుమారులు, కీర్తిశేషులు పూసర్ల సూర్యనారాయణమూర్తి కుమారుల ఆర్థిక సహాయంతో అన్నసమారాదన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్తమ వాలంటీర్‌గా దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి -గొలుగొండ:ఆపదమిత్ర మండల బెస్ట్ వాలంటరీగా గొలుగొండ మండలం కొత్తమల్లంపేట సచివాలయానికి చెందిన మాసా దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సామర్లకోట ఈటీసీ సెంటర్లో జరిగిన శిక్షణ తరగతల్లో శుక్రవారం ప్రిన్సిపల్ వేణుగోపాల్ చేతుల మీదుగా అపధమిత్ర బెస్ట్ వాలంటరీగా మెమెంటో అందజేశారు. నాతవరం, గొలుగొండ మండలాల్లో బెస్ట్ వాలంటీర్గా ఎంపికైన దుర్గప్రసాద్‌ను పంచాయితీ కార్యదర్శి నాగేంద్ర కుమార్, పలువురు మండల నాయకులు అభినందించారు.



షీల్డ్‌ను అందజేస్తున్న ప్రిన్సిపల్



ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా ఆలయ ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం:కొమిరలో గ్రామ ప్రజలందరి సహకారంతో నిర్మించిన గరగాలమ్మ ఆలయాన్ని మండల ఎంపీపీ పైలరాజు, జెడ్పిటిసి ఆదిమూర్తి, మండల కన్వీనర్ జగ్గారావు, గ్రామ సర్పంచ్ రవికుమార్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి గ్రామంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పాయకరావుపేట:పట్టణంలోని 10వ వార్డులోని కడిమీ వీధి ప్రధాన కాలువ నిర్మాణానికి సర్పంచ్ గార ఉషశ్రీ ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానికులు 20 సంవత్సరాలుగా మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన కాలువను నూతనంగా నిర్మించేందుకు సర్పంచ్ గార ఉషాశ్రీ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను, పబ్లిక్ ప్రచార వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, పిరాది రాజు, జగతా శ్రీను, లావేటి సన్యాసిరావు, ప్రభాకర్, హరీష్, ప్రసాద్, పండు, సురేష్, షాహీద్, తదితరులు పాల్గొన్నారు



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

సిఎంకు లేఖ

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేఖ పంపించినట్లు మత్స్యకార జేఏసీ మండల శాఖ అధ్యక్షులు పిక్కి నూకనాథం తెలిపారు. మత్స్యకారులను ఎస్టీగా గుర్తించాలని లేదా ఎస్ఎఫ్‌సిగా నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో అన్ని మత్స్యకార గ్రామాలకు వెళ్లి మత్స్యకారులను ఐక్యం చేసి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15న కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలు అందజేసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:డ్రై డే డ్రై డేను పురస్కరించుకొని మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామ సచివాలయాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లతో పాటు కీటక జనత వ్యాధులపై అవగాహన శిబిరాలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ ఎస్ఎస్‌వి శక్తి ప్రియ తెలిపారు. సైతార్ పేట గ్రామంలో ఆరోగ్య విస్తరణ అధికారి తంటపురెడ్డి నాగేశ్వరరావు, పిహెచ్ఎన్ఎం రత్నసఖి ఏడిస్ ఈజిప్ట్, ఎనాఫిలిక్స్, క్యూలెక్స్ జాతికి చెందిన దోమల కాటుతో ప్రబలే వ్యాధులు, నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో వారానికొక్కసారి ఖాళీ చేయాలని తెలిపారు. దోమల లార్వాలను మొదటి దశలోనే అంతం చేయడంతో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని మలేరియా ఇన్చార్జ్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు కొండబాబు, అనుష, సచివాలయం హెల్త్ సెక్రటరీ లు పి.నూకరత్నం, పి శ్రీరాములు, వేణు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రఘు ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఎ ప్లస్ గ్రేడ్ గుర్తింపు



మాట్లాడుతున్న ఛైర్మన్ రఘు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రఘు ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన నాక్ ఎ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ కలిదిండి రఘు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కళాశాలను సందర్శించిన నాక్ నిపుణుల బృందం కళాశాలలో మౌలిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలను ప్రత్యక్షంగా పరిశీలించి అత్యుత్తమ ర్యాంకును అందించినట్టు తెలిపారు. ఇప్పటికే తమ కళాశాల అటానమస్, ఎన్‌బిఎ గుర్తింపును కలిగి ఉందని చెప్పారు. కళాశాలలో అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఎలక్ట్రోలాంజ్, ఇన్నోవేషన్ స్టూడియో, బిఎస్ఎన్ఎస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ, అడ్వాన్స్‌డ్ కోడింగ్ ఫెసిలిటీలను నాక్ నిపుణుల బృందం ప్రత్యక్షంగా పరిశీలించి ప్రశంసించినట్టు తెలిపారు. కంప్యూటర్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలోని నాలుగు రీసెర్చ్ సెంటర్లు జెఎన్‌టియు గుర్తింపును సైతం కలిగి ఉన్నాయన్నారు. నిపుణత్వం కలిగిన బోధనా సిబ్బంది, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు తమ ప్రత్యేకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విజయ్ కుమార్, ఐక్యూఎసి సమన్వయకర్త డాక్టర్ పి.శశికిరణ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

టిడిపి కౌన్సిలర్ చింతకాయల రాజేష్

ప్రజాశక్తి-గొలుగొండ:పార్టీకి కష్ట కాలంలో అండగా ఉన్న కార్యకర్తలు అందరికీ ఎప్పుడూ అండగా ఉంటామని అయ్యన్న యువసేన అధ్యక్షులు, నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తెలిపారు. మండలంలో ఏఎల్ పురం టిడిపి కార్యకర్తలతో శుక్రవారం సాయంత్రం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలంతా ప్రస్తుత ప్రభుత్వ పాలనకు విసుగు చెందారన్నారు. టిడిపికి అండగా ఉండాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారని, అధికారంలో లేనప్పటికీ తెదేపాకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు, మాజీ జడ్పిటిసి వేణుగోపాల్, చోద్యం సర్పంచ్ గోపాలకృష్ణ, మాజీ ఎంపిటీసీ నారాయణమూర్తి నాయుడు, నర్సీపట్నం కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చింతకాయల రాజేష్

కళాశాలలో ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి -కొత్తకోట: ఇంటర్ పరీక్షలలో తప్పిన విద్యార్థులకు కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రత్యేక తరగతులు ఈ నెల 1న ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ సాయికుమార్ మాట్లాడుతూ, ఇంటర్ తప్పిన ఆయా విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, దీనిలో భాగంగా ప్రతి సబ్జెక్టు విద్యార్థులకు సులభ తరంగా అర్థమయ్యేందుకు గానూ ప్రత్యేకమైన స్టడీ మెటీరియల్ తయారు చేసిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రిన్సిపాల్ సాయికుమార్ విద్యార్థులకు సబ్జెక్ట్ పుస్తలకాలను అందించారు. ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ప్రిన్స్‌పాల్ వివరించారు.

సమ్మర్ వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయ:స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గిరి బాల నేస్తం చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా వర్క్ షాప్ సమ్మర్ క్యాంపు శుక్రవారం ప్రారంభమైంది. రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ సహకారంతో ఈ నెల 5, 6వ తేదీలలో జరుగుతున్న ఈ వర్క్ షాప్ లో ఆంధ్ర ప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ కొరెడ్ల రమాప్రభ పిల్లలకు ఆటపాట నేర్పించడమే కాకుండా క్యాంప్ ఉపయోగంపై మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్య పరంగా వెనుకబడిన గిరిజన విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించడానికి గిరి బాల నేస్తం ఆధ్వర్యంలో 3 సంవత్సరాల నుంచి జిల్లాలో గిరి బాల నేస్తం చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. నైపుణ్యాన్ని, సజనాత్మకతను వెలికి తీసే బొమ్మలను తయారు చేయడం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుతూ గిరి బాల నేస్తం గిరిజన ప్రాంతంలో విజ్ఞానం, వినోదం, వికాసం పెంచడం జరుగుతుందన్నారు. గిరి బాల నేస్తం జిల్లా కన్వీనర్ వివి జయ మాట్లాడుతూ, ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిరి బాల నేస్తం జిల్లా నాయకులు పి కుమారి, ఎస్. నాగేంద్ర, ఎం.చిట్టిబాబు, మోనీత్, రాధిక విద్యార్థులుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న దొరైస్వామి

సీడ్స్ కంపెనీని మూసివేసే ఆలోచనలేదు

- బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరైస్వామి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి:సీడ్స్ కంపెనీని మూసివేసే ఆలోచన యాజమాన్యానికి లేదని బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరైస్వామి కార్మికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సీడ్స్ కంపెనీ యాజమాన్యంతో కలిసి ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగుల్లో ఏర్పడిన అపోహలను తొలగించి, వారు వ్యక్తంచేసిన సందేహాలను నివృత్తిచేసిన ఆయన కంపెనీని మూసివేయబోమని ఉద్యోగులకు తెలిపారు. దీంతో షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి విధుల్లోకి రావడానికి ఉద్యోగులు అంగీకరించి ఇళ్లకు వెళ్లారని దొరైస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల మధ్య ఏర్పడిన అపార్థాలతో రెండ్రోజులుగా సీడ్స్ కంపెనీలో పనికి అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.

సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వయోజనులకు అక్షరాస్యతలో సేవలందించిన సాక్షర భారత్ కోఆర్డినేటర్లకు న్యాయం చేయాలని సాక్షర భారత్ గ్రామ కోఆర్డినేటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2018లో సాక్షర భారత్ వ్యవస్థను అర్ధాంతరంగా ఆనాటి ప్రభుత్వం రద్దు చేసిందని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా అక్షరాస్యత సేవలో ఉన్న 20500 మంది గ్రామ, మండల కోఆర్డినేటర్ల ఉపాధికి దూరమై రోడ్డును పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షర భారత్ కోఆర్డినేటర్లలో అర్హత ఉన్న 502 మందికి కార్పొరేషన్ శాఖలో నియమించినట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు వెంకటరామిరెడ్డి ప్రకటించడం హర్షణీయమని, అయితే మిగతా సుమారుగా 20,000 మందిలో 15000 మందికి అర్హత లేదని చెప్పడం అన్యాయమన్నారు. అందరికీ ఉపాధి కల్పించి, ఆదుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు


పతకాలు స్వీకరిస్తున్న క్రీడాకారులు

బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :తిరుపతిలో మే 1 నుండి 5వ తేదీ వరకు జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి సీఎం కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు సాధించారని శాప్ కోచ్ ఆబ్బు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సీపట్నం నుండి ముగ్గురు సీనియర్ ఉమెన్ బాక్సర్లు కోలుకుల కృష్ణవేణి (60కేజీ), జిబొంతు మౌనిక (80కేజీ) ల విభాగంలో ఫైనల్‌లో గోల్డ్ మెడల్ సాధిం చారన్నారు. వీరిని శాప్ అధికారులు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు అభినందించి బంగారు పతకాలను అందజేశారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని జానకయ్య పేట గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో సీతారామరాజు శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీలు, మేట్స్ తో మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల లోపు పని ప్రదేశానికి వచ్చి, నిర్ణీత కొలతల మేరకు పని చేయాలన్నారు. రోజుకు కనీస వేతనం రూ.272 వచ్చే విధంగా పని చేయాలన్నారు. పని ప్రదేశంలో నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

7న నాగబాబు పర్యటన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:యలమంచిలిలో ఈనెల 7న జనసేన పార్టీ కార్యాలయం ప్రారంబోత్సవానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రానున్నారని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. ముందుగా అనకాపల్లి పార్టీ కార్యాలయం నుంచి నాగబాబు భారీ ర్యాలీతో హరిపురం గ్రామం చేరుకొని అక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారన్నారు. నాయకులు, సైనికులు, వీర మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

సంగీతం, సాహిత్యంపై శిక్షణ



ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం ఐదు రోడ్ల జంక్షన్‌లోని ప్రభుత్వ మెయిన్ పాఠశాల వద్దశ్రీ గీత సంగీత ప్రచార మండలి ఆధ్వర్యంలో శుక్రవారం తాళ్లపాక అన్నమాచార్యుల 615 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేసవి సెలవులలో 40 రోజులు పాటు ఉచితంగా సంగీతం, నృత్యం, సాహిత్యంతో పాటు పిల్లలకు మంచి నడవడిక, అంతరించిపోతున్న పిట్టకథలు నేర్పిస్తున్నట్లు ప్రచార మండలి సెక్రెటరీ ఆచంట రాజేశ్వరి తెలిపారు. ఆసక్తి కలవారు వయస్సుతో సంబంధం లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ఆమె అన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వరల్డ్ హ్యాండ్ హైజిన్ డే పురస్కరించుకొని శుక్రవారం అవగాహన శిబిరం నిర్వహించారు. హ్యాండ్ వాష్‌తో కలుగు లాభాలను మెడికల్ ఆఫీసర్ ఎన్.వాసంతి వివరించారు. ప్రతి ఒక్కరూ ఏదైనా తినడానికి ముందు హ్యాండ్ వాష్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి తంటపరెడ్డి నాగేశ్వరరావు, పిహెచ్ఎన్ ఏం రత్నసఖి, హెల్త్ అసిస్టెంట్, మలేరియా ఇన్చార్జి నోడల్ ఆఫీసర్ ప్రసాద్, గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది